రోడ్డుపై గుంత..
ప్రయాణానికి చింత



పోర్టర్స్‌లైన్ దర్గా సమీపంలో ఆలూరుకు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతలు

గుంతకల్లుటౌన్: దెబ్బతిన్న రోడ్లన్నింటినీ బాగుచేసి గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని బాకాలు ఊదిన కూటమి నేతల మాటలు కోతలుగానే మిగిలాయి. పట్టణంలోని ఆలూరు రోడ్ పోర్టర్స్‌లైన్ దర్గా సమీపంలో ప్రధాన రహదారిపై మూడు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఇక వర్షం పడినప్పుడు నీరు నిల్వ ఉంటే ఎక్కడ గుంత ఉందో..ఏ పక్కన గొయ్యి ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఇదే రహదారి మీదుగా ఆలూరు–గుంతకల్లు మధ్య నిత్యం రాకపోకలు సాగించే స్థానిక ఎమ్మెల్యే ఈ రోడ్డును బాగు చేయించి ప్రమాదాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకమే

క్లుప్తంగా

'సూపర్ హిట్' ఎఫెక్ట్



తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

తాడిపత్రి రూరల్: అనంతపురంలో జరిగిన కూటమి ప్రభుత్వ సమావేశం పుణ్యమా అని తహసీల్దార్ కార్యాలయం ఖాళీగా మారింది. తహసీల్దార్‌తో సహా అధికారులు ఎవరూ రాకపోవడంతో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. అధికారులు విధులకు గైర్హాజరు కావడంతో వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వ సమావేశానికి హాజరయ్యే ఉన్నతాధికారుల కారణంగా తహసీల్దార్ గైర్హాజరు కావచ్చు కానీ డిప్యూటీ తాహసీల్దార్, ఆర్ఐ, క్లర్క్‌లు, ఇతర కింది స్థాయి అధికారులు ఎందుకు విధులకు హాజరు కాలేదో అర్థం కావడం లేదు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి



మృతుడు నాగరాజు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని సజ్జలదిన్నె వద్ద గురువారం తెల్లవారుజామున లారీడ్రైవర్ నాగరాజు(40)గుండెపోటుతో మృతి చెందాడని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. లారీ క్యాబిన్‌లో నిద్రలోనే డ్రైవర్ మృతి చెందాడని, కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

అనాథ మహిళ మృతి



గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని మెయిన్ బజార్‌లో బుధవారం తెల్లవారు జామున గుర్తు తెలియని అనాథ మహిళ మృతి చెందింది. అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. అయితే మృతి చెంది ఐదారు గంటలైనా పోలీసులు కాని, మున్సిపల్ అధికారులు కాని పట్టించుకోలేదు. దీంతో కుక్కలు పీక్కు తినడానికి ప్రయత్నించినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

యువ రైతుకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురంలో ఓ యువ రైతు బుధవారం పంటకు మందు పిచికారి చేస్తూ అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అరవింద్ ఆముదం పంటను సాగు చేశాడు. పంటకు మందు పిచికారీ చేస్తున్న సమయంలో వాటిని పీల్చుకోవడంతో తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

14 కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణ భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో ఈనెల 14న ని పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, అధ్యక్షుడు కే రఘువీర్ రావు బుధవారం తెలిపారు. రోగులు తమ వెంట రెండు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో పాటు మూడు పాస్‌ఫొటోలు, సెల్‌ఫోన్ నంబర్‌తో హాజరుకావాలన్నారు. వివరాలకు 9440550000, 9866589899 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించండి



నిట్టూరులో రైతులకు యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విద్యావతి

యాడికి: వ్యవసాయాధికారులు సూచించిన మోతాదులో యూరియా వాడటంతో పెట్టుబడి తగ్గడంతో పాటు నేల కాలుష్యం కాకుండా కాపాడుకోవచ్చునని ఏడీఏ విద్యావతి రైతులకు సూచించారు. మండల కేంద్రంతో పాటు నిట్టూరు గ్రామాల్లో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంప్రదాయ యూరియాను కాకుండా నానో యూరియాను వాడినట్లయితే ఖర్చులు తక్కువగా ఉండి ఆదాయం పెరుగుతుందన్నారు. అర లీటరు యూరియాను ఒక ఎకరాకు వాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మహబూబ్ బాషా, గ్రామ వ్యవసాయ సహాయకులు రాంబాబు, రమేష్, నాగలక్ష్మి, యతీషా, రైతులు పాల్గొన్నారు.

పామిడిలో మోస్తరు వర్షం

పామిడి: పామిడిలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రోడ్లపై వర్షపు నీరు పారడంతో వాహనదారులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మూడురోజుల నుంచి ఎండ వేడిమితో ఉక్కపోతకు గురవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు.

చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం



నార్పలలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



తాడిపత్రిలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

శింగనమల(నార్పల): తెలంగాణలో సాయుధ పోరాట వీర వనితగా చాకలి ఐలమ్మ నిలిచారని, ఆమె ఆశయాలను కొనసాగిద్దామని రజక వృత్తిదారుల సంఘం మండల నాయకులు అన్నారు. చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం నార్పలలో ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నాయకులు పెద్ద బయ్యన్న, నారాయణప్ప, శ్రీనివాసులు,పాపన్న కుమార్, ఎర్నాగప్ప,వెంకటనారాయణ, రాఘవ, వీరనారప్ప, తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ వర్ధంతి..

తాడిపత్రి రూరల్: పట్టణంలో బుధవారం చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి జరిగింది. పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద చేతివృత్తుల సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో అమె చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి, నాయకులు నాగేంద్ర, గురునాథ్, సుబ్రహ్మణ్యం, ఓబులేసు, రామాంజి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలో బుధవారం రజక వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. రజక వృత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివా సులు మాట్లాడుతూ ఐలమ్మ సేవలను కొనియాడారు. నాయకులు శ్రీనివాసులు, చిన్న ఆంజనేయులు, మురళీ నవీన్, సత్యనారాయణ , వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సభకు రాకపోతే జరిమానా తప్పదు

- సూపర్‌సిక్స్ సభకు బలవంతంగా మహిళల తరలింపు



బీకేఎస్‌లో సీఎం సభకు వెళ్తున్న డ్వాక్రా మహిళలు

బుక్కరాయసముద్రం: నాయకుడు అంటే ప్రజల గుండెల్లో అభిమానం ఉండాలి. ఆ అభిమానంతో ఎందాకైనా నాయకుని వెంట నడిచేందుకు ప్రజలు సిద్ధపడతారు. అయితే సీఎం సభకు మహిళలను తరలింపులో బెదిరించే ధోరణి బీకేఎస్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అనంతపురంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు మండలం నుంచి భారీగా జనాలను తరలించాలని మహిళా సంఘాల ఆనిమేటర్లు, స్టోర్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రజా ప్రతినిధులు ఆదేశాలిచ్చారు. మీ గ్రామానికి పలానా బస్సు పంపిస్తున్నామని వాటి నిండా జనాలను తీసుకు రావాలని గత 3 రోజులుగా మీటింగ్‌లు పెట్టి సూచనలు చేశారు. దీంతో స్టోర్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ జనాన్ని సమీకరణ వీధి వీధి తిరిగి సమీకరించారు. ఇక మహిళా సంఘాల అధికారులు మీరేం చేసుకుంటారో జనాలను తీసుకురావాలని ఆనిమేటర్లకు హెచ్చరికలు జారీ చేశారు. పాపం ఆనిమేటర్లు వీధి వీధి తిరిగి సీఎం సభకు రావాలని ఇళ్ల వద్దకు వెళ్లి చెప్పగా దీంతో మాకు ఏం చేశారని.. సంఘంలో రుణాలు తీసుకుని వడ్డీలతో కట్టుకుంటున్నామని సభకు ఎందుకు రావాలని ప్రశ్నించడం వంటి పరిణామాలు బీకేఎస్‌లో చోటు చేసుకుంది. మీరు సభకు రాకపోతే సంఘంలో జరిమానాలు వేస్తామని కచ్చితంగా రావాల్సిందేనని పట్టు పట్టి సభకు తీసుకెళ్లారు. అంతే కాకుండా ఆనిమేటర్లకు సభకు సమీపంలో బస్సు వద్ద సంఘం మహిళలలో ఆనిమేటర్లు సెల్ఫీ ఫొటో తీసి పంపాలని ఐకేపీ అధికారులు హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం.

మద్యం అమ్మకాలు 'హిట్'



రాప్తాడులో వైన్ షాపు దగ్గర మద్యం కొనుగోలు చేస్తున్న తెలుగు తమ్ముళ్లు



రాప్తాడులో వైన్‌షాపు దగ్గరకు వచ్చిన వాహనాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి సర్కార్ అనంతపురం 'సూపర్ హిట్' సభ నేపథ్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. సభకు జనాలను తరలించేందుకు నాయకులు రూ.500 నగదులో పాటు ఒక క్వార్టర్ బాటిల్ ఇచ్చి బస్సుల్లోకి ఎక్కించారు. అయితే బస్సు ఎక్కీఎక్కగానే క్వార్టర్ కానిచ్చిన మందుబాబులు జేబుల్లో ఉన్న రూ.500 తీసుకుని దారిలో కనిపించిన మద్యం దుకాణాలకు పరుగులు తీశారు. ఈ క్రమంలోనే రాప్తాడులోని జేఎన్‌టీయూ రహదారిలో ఉన్న ఎస్‌వీఆర్ వైన్స్‌ను 'తమ్ముళ్లు' బార్‌గా మార్చేశారు. కొంతమంది మందుబాబులు వారికి కేటాయించిన ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ స్కూల్స్, కళాశాలలకు చెందిన బస్సులను వైన్ షాపు దగ్గరకే తీసుకువచ్చి మద్యం సేవించి సీఎం సభలకు వెళ్లారు. తెలుగు తమ్ముళ్ల దెబ్బకు రాప్తాడు వైన్ షాపు ఖాళీ అయ్యింది. కొంతమంది కూటమి నాయకులు సైతం తమ వాహనాల్లో వైన్ షాపు దగ్గరకు వచ్చి మద్యం తీసుకుని వెళ్తూ కనిపించారు.

విజయనగరలో స్థానికులకే సీట్లు కేటాయించాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని విజయనగర లా కళాశాలలో 80 శాతం సీట్లు స్థానికులకే కేటాయించాలని ఎస్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, బీఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు వినతిపత్రం అందజేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎల్ఎల్‌బీలో సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ యూనివర్సిటీల కన్వీనర్ యనమల ప్రసాద్, నాయకులు విజయ్‌కుమార్, భాను ప్రకాష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు శంకర్, బీఎస్ఎఫ్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పామిడి ఎద్దులపల్లిరోడ్డులోని ట్యాంకు సమీపాన ఇళ్ల మీదుగా వెళ్లిన విద్యుత్ తీగలు

పొంచి ఉన్న ప్రమాదం

పామిడి: పట్టణ ఎద్దులపల్లిరోడ్డులోని రైల్వే గేట్ సమీపాన ఓహెచ్ఆర్ ట్యాంకు వద్ద గల ఇళ్ల మీదుగా వెళ్లిన విద్యుత్‌తీగల వల్ల ప్రమాదం ముంచిందని స్థానికులు వీరయ్య, బాబు, రాజు, మాణిక్యమ్మ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాల నడుమ దూరంగా ఎక్కువగా ఉండటంతో తీగలు ఇళ్ల మీదుగా వేలాడుతున్నాయి. పెనుగాలులకు తీగలు ఒకదానికొకటి తాకిడికి నిప్పులు ఎగిసిపడుతున్నాయి. తీగలు తెగితిపడితే ప్రాణాలు గాల్లోకి కలిసి పోవాల్సిందే. విద్యుత్ శాఖాధికారులు తక్షణం స్పందించి పెనుప్రమాదం సంభవించకముందే మరో స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



గార్లదిన్నె పీహెచ్‌సీలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న స్వస్తి సభ్యులు

గార్లదిన్నె: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం నేషనల్ హెల్త్ మిషన్ అనుబంధం స్వస్తి ఆరోగ్య సంస్థ రాష్ట్ర స్థాయి సభ్యులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు ఏఎన్ఎం, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలకు ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వస్తి ఆరోగ్య సంస్థ రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, డాక్టర్ తన్మయి, టీం సభ్యులు, వేదిక, ఇవనా, పీహెచ్‌సీ డాక్టర్ మంజుల, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వస్తి టీమ్ మెంబర్ల సందర్శన..

పామిడి: ఎద్దులపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఖాదర్‌పేట హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం స్వస్తి టీమ్ సభ్యులు, స్టేట్ పోగ్రామ్ మేనేజర్లు శివకిశోర్, వేదిక, అసోసియేట్ మేనేజర్ డాక్టర్ తన్మయి, కమ్యూనికేషన్ అసోసియేట్ ఇవానా సందర్శించారు. ఈసందర్భంగా వారు ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్‌తో కలిసి క్లయిమేట్ కేర్ ఛాంపియన్ ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. స్థానిక వైద్య సిబ్బందితో ఈ ప్రోగ్రామ్‌పై సమీక్షించారు. ప్రజలకు ప్రోగ్రామ్‌తో చేకూరే ప్రయోజనాలపై అంచనా వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పని చేయండి



నాగసముద్రం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ యుగంధర్

గుంతకల్లు రూరల్/ గుంతకల్లుటౌన్/ పామిడి : ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్యారోగ్య సిబ్బంది పని చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డుల ప్రతిపాదనలో భాగంగా బుధవారం నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గుంతకల్లులోని నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాలతోపాటు పామిడి మండలం ఎద్దులపల్లి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతూ పీహెచ్‌సీలో తప్పనిసరిగా పదికి మించి ప్రసవాలు నిర్వహించాలని, ఆస్పత్రి ఆవరణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యం కోసం వచ్చే వారికి తప్పనిసరిగా రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేయాలన్నారు. వ్యాక్సినేషన్ గదిలో వ్యాక్సిన్‌ను భద్రంగా ఉంచాలన్నారు. ఇమ్యునైజేషన్ ఎప్పటికప్పుడు ఏఎన్ఎంల ద్వారా పూర్తి చేయించాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబు, డాక్టర్ గంగాధర్, డాక్టర్ సజీవ్, డాక్టర్ హరిత, డాక్టర్ అరుణ, వైద్యాధికారి సుధాకర్, డాక్టర్ ఉదయార్క్, సిబ్బంది పాల్గొన్నారు.

సుఖ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: హెచ్ఐవీ/ఎయిడ్స్, సుఖ వ్యాధులు, క్షయవ్యాధి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు యశ్వంత్ పేర్కొన్నారు. ఐఈసీ ఇంటెన్సిఫైడ్ క్యాంపైన్‌లో భాగంగా బుధవారం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో కరపత్రాలను పంపిణీ చేసి వ్యాధుల నివారణ, జాగ్రత్తలు, నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ, మాస్ ఎడ్యుకేషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఐసీటీసీ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సుఖ వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి? రాకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి? క్షయవ్యాధి నిర్మూలన, మాదక ద్రవ్యాలు, చెడు వ్యాసనాల నివారణపై విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఆస్పత్రుల్లో అందే ఉచిత సేవలపై తెలియజేశారు. కార్యక్రమంలో మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ఆస్పత్రి హెడ్ నర్స్ తదితరులు పాల్గొన్నారు.

అరటి పంట సాగుకు 30 శాతం సబ్సిడీ

కూడేరు: ఎస్సీ, ఎస్టీ రైతులు అరటి పంట సాగుకు 30 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందించనుందని నియోజక వర్గ హార్టికల్చర్ ఆఫీసర్ యామిని, ఎంపీఈఓ జాస్మిన్ బుధవారం తెలిపారు. రెండున్నర ఎకరాలో 4 వేల అరటి మొక్కలను సాగు చేసుకోవాలన్నారు. సాగైన రెండు నెలలకు హార్టికల్చర్ ఆఫీస్ లేదా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే తొలి ఏడాది అరటి పెంపకానికి రూ.42 వేలు. రెండో ఏడాది రూ.20 వేలు ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన వైవీఆర్ సోదరులు



మిథున్‌రెడ్డిని కలిసి మాట్లాడుతున్న వైవీఆర్, బాలనాగిరెడ్డి

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఆయన సోదరుడు మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని మిథున్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసి ఆయా నియోజకవర్గాల్లోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అక్రమ కేసుల నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకొస్తారని వారు స్పష్టం చేశారు. వీరితో పాటు ఉరవకొండ, ఆదోని నియోజకవర్గాలకు చెందిన పార్టీ యువనేతలు వై.భీమిరెడ్డి, వై.సాయిమనోజ్‌రెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర వేడుకలు



హెచ్చెల్సీ కాలనీలో పూజలందుకున్న వినాయకుడు

అనంతపురం కల్చరల్: వినాయకునికి ప్రీతికరమైన భాద్రపదమాసం, సంకష్టహర చతుర్థి రావడంతో బుధవారం పలు ఆలయాలలో విశేష పూజలు జరిగాయి. నగరంలోని మూడోరోడ్డు బాబా మందిరం, మారుతీనగర్‌లోని శ్రీకోదండ రామాలయం , రజకనగర్‌లోని సంకష్టహర వినాయక ఆలయాలలో సాయంత్రం నుంచి రాత్రి వరకు వినాయకుడు అభిషేకాలు, అలంకార సేవలు అందుకున్నాడు. ప్రత్యేకంగా తయారు చేసిన కుడుములతో నైవేద్యం సమర్పించారు. హెచ్చెల్సీ కాలనీ శ్రీనసనకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ గురుశేఖరబాబు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

నేడు హుండీ కానుకల లెక్కింపు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని లక్ష్మిచింతల వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం ఉదయం 10 గంటలకు స్వామి వారి హుండీ కానుకలు లెక్కించనున్నట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు పంచె, టవాల్ ధరించి పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

ట్రాఫిక్ ఆంక్షలతో వాహనదారులకు ఇక్కట్లు



జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు



రోడ్డుకు అడ్డంగా పెట్టిన బారికేట్లు

బుక్కరాయసముద్రం: అనంతపురంలో కూటమి ప్రభుత్వం బహిరంగ సభ నేపథ్యంలో పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై తదితర నగరాలకు వెళ్లే వాహనాలు అనంతపురం బైపాస్ మీదుగా వెళ్లకూడదని పాముదాయి వద్ద నూతనంగా నిర్మించిన నేషనల్ హైవే-544డి రహదారి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కార్లు, లారీలు బస్సులు, ట్రక్కులు లాంటి వాహనాలను ఆపి వేశారు. ఈ వాహనాలన్నీ పాముదాయి వద్ద ఎన్‌హెచ్-544 డీ రహదారి నుంచి బీకేఎస్ మండలంలోని గోవిందపల్లి మీదుగా రెడ్డిపల్లి తాడిపత్రి హైవే ద్వారా నాయనపల్లి క్రాస్, అక్కడ నుంచి నార్పల మీదుగా బత్తలపల్లి మీదుగా చెన్నై, బెంగళూరు, తిరుపతి వంటి నగరాలకు వెళ్లాలని సూచించారు. దీంతో ఎక్కడెక్కడ నుంచో వాహన డ్రైవర్లు రూట్ తెలియక పాముదాయి వద్ద ఉన్న నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిపైనే నిలిపేసుకున్నారు. ఈక్రమంలో సమయానికి వాహన దారులు సరుకులు తీసుకెళ్లలేక నాన అవస్థలు పడ్డారు. సభ ముగిసిన తర్వాత పాముదాయి నుంచి అనంతపురం తపోవనం మీదుగా బెంగళూరు, చెన్నై, తిరుపతి వంటి నగరాకు వాహనాలు వెళ్లిపోయారు.

ఊబిచెర్లలో కేబుల్ చోరీ



చోరీ జరిగిన టవర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులోని సెల్‌టవర్‌కు సంబంధించిన కోర్ కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామ శివారులో 5జీ మొబైల్ నెట్‌వర్క్‌కు సంబంధించి సెల్ టవర్ ఉంది. అయితే బుధవారం వేకువజామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సెల్ టవర్‌కు ఉన్న సుమారు 300 మీటర్ల కోర్ కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని కంపెనీ ప్రతినిధి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా మంగళవారం రాత్రి వన్నేదొడ్డి గ్రామ శివారులోని పంట పొలాల్లో కేబుల్ మోటార్లు, స్టార్లర్లు ఎత్తుకెళ్లే దొంగలను రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గత రెండు నెలలుగా పొలాల్లో పంటలకు నీరు పెట్టే మోటార్లకు సంబంధించిన కేబుళ్లను చోరీ చేస్తున్నారని పోలీసుల అదుపులో ఉన్న దొంగలను విచారిస్తే అన్ని బయటకు వచ్చే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.